ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
శనివారం 19 అక్టోబరు 2024



నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నామని మిషన్ భగీరథ మంచిర్యాల డివిజన్ ఈఈ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్ మంచిర్యాల పరిధిలోని వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌లో సమస్య కారణంగా మంచిర్యాల, దండేపల్లి, లక్షెట్టిపేట, మందమర్రి, భీమారం, హాజీపూర్, కోటపల్లి, చెన్నూరు మండలాలు, జిల్లాలోని మున్సిపాలిటీల్లో నీటి సరఫరా జరగదని, ప్రజలు సహకరించాలని కోరారు.

కోర్టు భవన నిర్మాణ పనులను పరిశీలించిన జడ్జి



పనులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి, న్యాయవాదులు

బెల్లంపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కన్నాల జాతీయ రహదారి పక్కన జూనియర్ సివిల్ కోర్టు, న్యాయమూర్తి నివాస భవన నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ నెల 26న న్యాయమూర్తి నివాస భవనం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట మంచిర్యాల సీనియర్ సివిల్ న్యాయమూర్తి సంపత్, బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముకేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, సీనియర్ న్యాయవాదులు గోపికిషన్ సింగ్, న్యాయవాదులు ఉన్నారు.

గ్రూప్ 2, 3 పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 2, 3 పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రూప్ 2 పరీక్షలు డిసెంబరు 15, 16 తేదీల్లో, గ్రూప్ 3 నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. అధికారులు పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను గుర్తించి పూర్తి వివరాలతో నివేదికలు అందించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ గ్రూప్ 2, 3 పరీక్షలకు జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 15 వేల మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, పోలీసు నోడల్ అధికారి సుందర్‌రావు, ఆర్సీ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టు తడబాటు..



- జిల్లాలో నామమాత్రంగా అమలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- ఈయేడు ఇప్పటి వరకు ఇవ్వని శిక్షణ
- విద్యార్థుల్లో సామర్థ్యం మెరుగుపరచడమే లక్ష్యం
- పట్టింపులేక నీరుగారుతున్న ప్రత్యేక కార్యక్రమం

FOUNDATIONAL LITERACY AND NUMERACY

మంచిర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం జిల్లాలో నామమాత్రంగా అమలవుతోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం లక్ష్యం నీరుగారుతోంది. కరోనా మహమ్మారి విద్యా రంగంలో తీవ్ర ప్రభావాన్ని చూపింది. పాఠశాల విద్యలో విద్యార్థులు వారి వారి తరగతులకు చెందిన సామర్థ్యాలను సాధించగలిగినపుడే నాణ్యమైన విద్య సాకారమవుతుంది. కరోనా కాలంలో ఆన్‌లైన్ తరగతుల ద్వారా ఇంట్లోనే చదుకోవలసిన పరిస్థితి వచ్చింది. పాఠశాల విద్య తిరిగి గాడిలో పడిన తర్వాత చిన్నారుల్లో విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తే దారుణంగా పడిపోయి నట్లు గుర్తించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం. అక్షరాలను గుర్తించడం, లెక్కలు చేయడం రానివారు అనేక మంది ఉన్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. దీనిని గుర్తించిన విద్యాశాఖ అటువంటి విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 2022-23 విద్యా సంవత్సరం నుంచి తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గతేడాది ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పిల్లల్లో విద్యా సామర్థ్యాలు కొంత మెరుగయ్యాయి.

బదిలీలు, పదోన్నతులతో బ్రేక్..

ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో కార్యక్రమం అమలుకు బ్రేక్ పడింది.

అధికారులంతా బీజీగా ఉన్నందున పర్యవేక్షణ కొరవడింది. ఈ ఏడాది తొలిమెట్టు అమలుపై ఉపాధ్యాయులకు శిక్షణే ఇవ్వలేదు. జిల్లాలో 655 పాఠశాలలను కార్యక్రమం కోసం ఎంపిక చేయగా 14,836 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. సింహభాగం స్కూళ్లలో సంపూర్ణంగా అమలు కావడం లేదు. దీంతో చదవడం, రాయడం, లెక్కలు చేయడంలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించే ప్రక్రియ అటకెక్కినట్లయింది.

ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు

జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమం అమలు చేస్తారు. మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధనకు అవసరమైనట్లుగా వారంలో ఐదు రోజుల పాటు బోధన చేసి, ఒక రోజు పరీక్ష నిర్వహించాలి. బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులను విభజించి కృత్యాల బోధన చేపట్టాలి. పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు, స్లిప్ టెస్ట్, రాత పనులు అంతర్భాగంగా నిర్వహించాలి. సంబంధిత వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. ఈ ప్రక్రియంతా జిల్లాలోని పాఠశాలల్లో నామమాత్రంగా నిర్వహిస్తున్నారనే అభియోగాలు ఉన్నాయి.

విద్యా సంవత్సరంలో 220 రోజుల పనిదినాలు ఉండగా, 140 రోజులు బోధనాభ్యాసన ప్రక్రియ నిర్వహించాలి. వారానికి ఐదు రోజులు బోధనాభ్యాసం, ఒక రోజు మూల్యాంకనం, పునరాభ్యాసం చేయించాలి. విద్యార్థులంతా భాగస్వాములు అయ్యేలా వార్షిక, అర్ధవార్షిక, త్రైమాసిక, రోజువారి కాలాంశం లేదా పీరియడ్ ప్రణాళిక రూపొందించాలి.

న్యూస్ బాక్స్

బాబోయ్ బంగారం

10 గ్రాములకు రూ.80 వేలు



మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో బంగారం ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. వారం క్రితం తగ్గినట్లు కనిపించిన పసిడి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరుగుతుండడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 16న 10 గ్రాముల బంగారం ధర రూ.78,800 ఉండగా శుక్రవారం రూ.80 వేలకు చేరింది. వివాహాల సీజన్ ప్రారంభంతో బంగారానికి మంచి డిమాండ్ ఉంది.

పంట రుణ మాఫీ చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నెన్నెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులందరికి వెంటనే పంట రుణ మాఫీ చేయాలని బీజేపీ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు శుక్రవారం నెన్నెలలో వినతిపత్రం అందజేశారు. రేషన్ కార్డులున్న రైతులకు సైతం రుణమాఫీ కాలేదన్నారు. దసరాలోపు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు చేయలేదన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు శైలేందర్‌సింగ్, నాయకులు ఉన్నారు.

గూండాయిజాన్ని కట్టడి చేస్తున్నందుకే ఇంటిపై దాడి

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి, గూండాయిజాన్ని కట్టడి చేస్తున్నందుకే గుర్తు తెలియని వ్యక్తులు నా ఇంట్లోకి ప్రవేశించి వాచ్‌మన్‌పై దాడి చేశారని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14న ముగ్గురు ముసుగులు ధరించి ప్రహరీ దూకి లోపలికి ప్రవేశించి వాచ్‌మన్‌ను కొట్టారని, నిందితుల ఆచూకీ కోసం గాలింపు జరుగుతుంద న్నారు. గంజాయి, గూండాయిజాన్ని నిర్మూలించడానికి ప్రయత్నం చేస్తుండటం అక్రమార్కు లకు గిట్టడంలేదన్నారు. గత ప్రభుత్వం లో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్ రావు అండతో చెలరేగిపోయిన వారిని పోలీసులు అరెస్టు చేస్తున్నారని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలో హంతకులు, గూండాలను ఎలా ప్రోత్సహిస్తారని ప్రశ్నించారు. గంజాయి ఎక్కడి నుండి వస్తుందో ఎవరు తెస్తున్నారు, ఎవరు అమ్మేది, గత కారకులు ఎవరో అందరి కీ తెలుసన్నారు. తన పాలనలో సామాన్యులకు ఏ అన్యాయం జరగదని భరోసానిచ్చారు. కూరగాయల మార్కెట్, గంగారెడ్డి రోడ్, డీఎఫ్ఓ కార్యాలయం, వేంకటేశ్వర టాకీస్ రోడ్ల విస్తరణ చేస్తున్నామని, దీనికి అందరు సహకరిస్తున్నా రన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, వంతెన నిర్మాణానికి రూ.15 కోట్ల మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఐబీ ప్రాంతంలో మాతా శిశు ఆసుపత్రి నిర్మాణం విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్లు రావుల ఉప్పలయ్య, సురిమిల్ల వేణు, వైస్ చైర్మన్ నల్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికంగా ఎదగాలి

ఎమ్మెల్యే గడ్డం వినోద్



నెన్నెలలో మిని పరిశ్రమను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్

నెన్నెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించు కొని మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మహిళల ఉన్నతితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యపడుతుందన్నారు. మండల కేంద్రంలో స్వయం సహాయ సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన వ్యవసాయ పనిముట్ల విక్రయ కేంద్రం, పిండి వంటలు, పచ్చళ్ల తయారీ కేంద్రం, మెడికల్ స్టోర్‌ను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు.

గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. రుణాలు పొంది క్రమశిక్షణతో వ్యాపారం చేస్తే అద్భుతాలు సాధించవచ్చన్నారు. సెర్ప్ ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని సాధికారత వైపు నడవాలన్నారు. బ్యాంకుల్లో పొదుపు చేసుకుంటే భవిష్యత్తులో ఉపయోగడతాయని సూచించారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించు కొని వ్యాపారాలను అభివృద్ధి చేసు కోవాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం చిత్తాపూర్‌లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. డీఆర్‌డీఏ పీడీ కిషన్, టీజీబీ ఆర్ఎం మురళిమనోహర్ రావు, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఏపీఎం విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంతో పాటు చెన్నూరు, కోటపల్లి, భీమారం మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈ కైసర్, ఏడీఈ బాల కృష్ణలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు 132కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విని యోగదారులు సహకరించాలని కోరారు.

హాజీపూర్: గుడిపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు విద్యు త్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ కైసర్, ఏడీఈ మోహన్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపేట, నంనూర్, చందనాపూర్, ముల్కల్ల గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాండూర్: తాండూర్, రేచిని సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు కారణంగా శనివారం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

భీమారం: భీమారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నస్పూర్: నస్పూర్ 33కేవి సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ కారణంగా శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బెల్లంపల్లి: శివాలయం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి బస్తీ, బజార్ ఏరియా, కన్నాలబస్తీ, టేకుల బస్తీ, కాంట్రాక్టర్ బస్తీ, ఎండీ ఖాసీంబస్తీ, బూడిదగడ్డ, బాబుక్యాంపు, ఎఎంసీ ఏరియా, శాంతిఖని, హనుమాన్‌బస్తీ, రాంనగర్, అశోక్ నగర్, రడగంబాల బస్తీ, చంద్రవెల్లి, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, లంబాడితండా గ్రామాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

కోటపల్లి: విద్యుత్ మరమ్మతు కారణంగా కోటపల్లి మండలంలోని గ్రామాల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కాంటా చౌరస్తా వద్ద నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని శుక్రవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులతో పాటు యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకపోవడంతో విద్యారంగం కుంటు పడుతుందన్నారు. విద్యాసంస్థను నిర్లక్ష్యం చేసేలా ప్రభుత్వం అడుగులు వేయడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. కళాశాల మూసివేతలతో విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపివేయాల్సిన దుస్థితి ఎదురవుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని, లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నాయకులు సబ్బని రాజేంద్రప్రసాద్, అల్లి సాగర్, దీపక్‌కుమార్, శ్రీకాంత్, పసులేటి వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



చాకపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం చాకపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రుణమాఫీ కానీ రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేపడుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాత చీరలు మాకొద్దు

నెన్నెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మహిళలు బహిష్కరిం చారు. నెన్నెలలో శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా చీరలు అందజేయాలని అధికారులు నిర్ణయించారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సమయ భావంతో కార్యక్రమంలో పాల్గొనకుండా వెళ్ళిపోయారు. అధికారులు చీరలు ఇచ్చేందుకు గోదాం వద్దకు వెళ్లారు. చీరలను చూసిన మహిళలు పాత స్టాక్‌గా గుర్తించి తీసుకునేందుకు నిరాకరించారు. చాలా రోజులుగా నిల్వ చేసి ఉంచడంతో ముక్క వాసన వస్తోందని మహిళలు పేర్కొన్నారు. గతంలో మిగిలిన చీరలకు కొత్త స్టిక్కర్లు వేశారని చెప్పారు. నాణ్యమైన చీరెలు ఇస్తారనే ఆశతో వచ్చామని, పాతవి ఎలా తీసుకుంటామని ఆగ్రహంతో వెనుదిరిగారు.

మారుతున్న ఆహార అలవాట్లు

- చిరుధాన్యాలపై ఆసక్తి
- ఆరోగ్యానికి పెద్దపీట
- జొన్న రొట్టె, రాగిజావలకు గిరాకీ

7

సీఐగా ప్రమోద్‌రావు బాధ్యతల స్వీకరణ



మంచిర్యాల అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణ సీఐగా ఎస్.ప్రమోద్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆర్.బన్సీలాల్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ప్రమోద్‌రావు నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయాధికారులు



సృజన

నెన్నెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా పుప్పాల సృజన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఏవో పోస్టు ఖాళీగా ఉండగా సృజన రెగ్యులర్ అధికారిగా నియమితులయ్యారు. రైతులకు అందుబాటులో ఉంటూ వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



యమునా దుర్గ

భీమిని: మండల వ్యవసాయాధికారిగా యమునా దుర్గ శుక్రవారం రైతువేదికలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన విజయ్ వరంగల్ మండలంలోని వర్ధన్నపేట మండలానికి బదిలీ పై వెళ్లారు. ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. సిబ్బంది ఆమెను సన్మానించారు. ఏఈఓలు వినోద్, జంబుల కార్తీక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పెంచికలపేట, అక్టోబరు 18: మండలంలోని గొంట్లపేట గ్రామానికి చెందిన సాదు విజయకు రూ.28,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును బీజేపీ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుకర్, నాగేష్, వెంకన్న, ప్రభాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత


పెంచికలపేట, అక్టోబరు 18: మండలంలోని లోడ్‌పల్లి గ్రామానికి చెందిన నాంపెల్లి బాపు అయిదురోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మాజీసర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఆయన తెలిపారు.

చేయూత పథకంలో పెన్షన్‌లు మంజూరు

దహెగాం, అక్టోబరు 18: మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన ఇద్దరు, లగ్గాంకు చెందిన ఇద్దరు, దహెగాంకు చెందిన ఒకరికి చేయూత పథకంలో పెన్షన్లు మంజూరు అయినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. పెన్షన్ మంజూరైనట్లు ఆర్డర్ పత్రాలను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు.

ప్రతిపాదనలకే పరిమితమైన ఇకో ఫ్రెండ్లీ పార్కు

● రూ.కోటితో నిర్మాణానికి ప్రతిపాదనలు ● నిధులు కోసం నిరీక్షణ



కాగజ్‌నగర్‌లో నిర్మాణం చేపట్టనున్న ఇకో ఫ్రెండ్లీ ఫ్యామిలి పార్కు నమూనా చిత్రం

కాగజ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాగజ్‌నగర్ మున్సిపాల్టీ పరిధిలోని పెద్దవాగు సమీపంలో గ్రీన్‌బడ్జెట్ నిధులతో ఇకో ఫ్రెండ్లీ ఫ్యామిలీ పార్కు నిర్మాణం చేపట్టేందుకు తీసుకున్న చర్యలు కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. రెండేళ్ల క్రితం కాగజ్‌నగర్‌లో రూ.1కోటి నిధులతో పెద్దవాగు సమీపంలో ఇకో ఫ్రెండ్లీ ఫ్యామిలి పార్కు నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపల్‌కు వచ్చే నిధుల నుంచి పదిశాతం గ్రీన్ బడ్జెట్ నిధులకోసం కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉండటంతో పార్కుకోసం స్థలాన్ని సేకరించారు. పార్కు చుట్టూ వాకింగ్ పాత్ ఏర్పాటు, ఒక బ్లాంకెట్ హాలు, 21చిన్నపాటి గుడిసెలు, సెల్ఫీ వాటర్ ఫౌంటెన్, గ్రీన్‌పార్కు ఆవశ్యతక తెలుపుతూ ప్రత్యేకచార్ట్‌లు, అలాగే కిట్టిపార్టీలు చేసుకునేందుకు రెండు ప్రత్యేక గదులు నిర్మించేందుకు మున్సిపల్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనను పంపించారు. వీటితో పాటు పిల్లలకు తినుబండారాలు, స్నాక్స్ సెంటర్ కు కూడా ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని తీర్మాణించారు. అయితే మున్సిపాల్టీకి నిధులు రాలేదు. వీటితోపాటు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థికసంఘం నిధులు కూడా నిలిచిపోయాయి.

దీంతో ఇకో ఫ్రెండ్లీ ఫ్యామిలీ పార్కు నిర్మాణం నిలిచిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఓటమి పాలుకావటం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. ఆస్తిపన్ను వసూలు చేసినా అవి కేవలం మున్సిపల్ కార్మికుల జీతాలకే సరిపోతున్నాయి.

నిధుల విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం..



కాగజ్‌నగర్ మున్సిపాల్టీ పరిధిలో గ్రీన్‌బడ్జెట్ నిధులు రూ.1కోటితో ఇకో ఫ్రెండ్లీ ఫ్యామిలి పార్కు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాం. పాలక వర్గ సభ్యుల ఆమోదం కూడా లభించింది. కేవం నిధుల కోసం వేచి చూస్తున్నాం. నిధులు వచ్చిన వెంటనే కూడా పనులు ప్రారంభిస్తాం.

-అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్

క్రైం కార్నర్

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య



లింగయ్య (ఫైల్)

దండేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాసిపేట గ్రామానికి చెందిన చిరుత లింగయ్య(44) కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగయ్య రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. లివర్ చెడిపోవడంతో వైద్యం చేయించినా నయం కాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా పురుగుల మందు తాగి వాంతి చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కిన లారీ

బెల్లంపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి బైపాస్ రోడ్డులో శుక్రవారం బెల్లంపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కింది. దీంతో లారీ ముందు టైర్లు ఊడిపోయాయి. ప్రయాణిస్తున్న వారు ఒక్కసారిగా ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

దండేపల్లి,అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఊట్ల (గుండాల)అటవీ ప్రాంతంలో చెట్ల పొదల మధ్య పేకాట ఆడుతుండగా శుక్రవారం రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 53వేల460 తోపాటు 4సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. రామగుండం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ ఎస్సై లచ్చన్న, సిబ్బంది గుండాల ఆటవీ ప్రాంతంలో దాడులు చేయగా పెట్టెం తిరుపతి, ఎండి కలిమ్, గంధం నారాయణ చింధం సతీష్‌లను పట్టుకోగా, పోతరవేణి లచ్చన్న, నెల్కి రవీందర్‌లు పారిపోయారన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిపై దాడి



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

మంచిర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు, హాజీపూర్ మాజీ ఎంపీపీ మందపెల్లి స్వర్ణలత భర్త, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌పై కొందరు దాడికి పాల్పడ్డారు. రాపల్లి వద్ద కారులో వెళ్తున్న శ్రీనివాస్‌పై అకారణంగా దాడిచేసి కొట్టారని ఆయన భార్య స్వర్ణలత ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. కారులో వెళ్తున్న తన భర్తను బైక్‌పై వస్తున్న వ్యక్తులు ఢీకొట్టి దాడికి పాల్పడ్డట్లు తెలి పారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరామర్శించారు.

దాడి ఘటనలో ఇరు వర్గాలపై కేసు నమోదు

హాజీపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాపల్లి గ్రామానికి చెందిన మందపల్లి శ్రీనివాస్‌పై అదే గ్రామానికి చెందిన తంగళ్ల రమేష్, దెనవేని రాజశేఖర్, తంగళ్ల సాగర్‌లు శుక్రవారం దాడి చేశారు. ఉదయం రాపల్లిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ దగ్గర రమేష్, రాజశేఖర్, సాగర్‌లను చంపాలనే ఉద్దేశ్యంతో శ్రీనివాస్ కారుతో అడ్డగించి ఇనుప రాడ్డుతో వారిపై దాడి చేశాడు. దీంతో రమేష్ కాలు ఫ్రాక్చర్ కాగా, రాజశేఖర్, సాగర్‌లకు గాయాలయ్యాయి. ముగ్గురు శ్రీనివాస్‌పై దాడి చేయగా శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు ఏఎస్ఐ చాంద్ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

వాంకిడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖమాన గ్రామానికి చెందిన మస్నే రావూజీ(45) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. రావూజీ మద్యానికి బానిసై ఇంట్లో సామాన్లు విక్రయించి మద్యం తాగేవాడు. గురువారం మద్యం సేవించి ఇంటికి వచ్చి పశువుల కొట్టంలో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన అతని కూతురు వెంటనే తల్లికి తెలిపింది. అనంతరం రావూజీని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

రెబ్బెన, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన జక్కుపల్లికి చెందిన రజిత(39) కన్పించటం లేదని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 12న శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి ఐబీ తాండూరుకు సంతకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ సమాచారం లేదన్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఏర్పాట్లు

● జిల్లాలో 34 కేంద్రాలు

● 21నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కాగజ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు అంతా సిద్ధం చేశారు. జిల్లాలో 34కేంద్రాల్లో వరికొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 21నుంచి కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. వరిధాన్యం కొనుగోలుకు పక్కాగా నిబంధనలు ఏర్పాటు చేశారు. ఈ నిబంధనలను రైతులు తప్పకుండా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. సన్నరకం, దొడ్డురకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయనున్నారు. ధాన్యానికి ప్రభుత్వం సనీస మద్దతు ధర రూ.2320గా నిర్ణయించింది. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులు తేమశాతం 17 ఉండాలని సూచిస్తున్నారు.

క్రమ సంఖ్య	నాణ్యత ప్రమాణాలు	శాతం
1.	తేమ	17
2.	చెత్త, తాలు	10
3.	మట్టిపెల్లలు, రాళ్లు	1.0
4.	చెడిపోయిన రంగుమారిన మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం	5
5	పూర్తిగా తయారు కాని ముడుచుపోయిన ధాన్యం	3
6	తక్కువ రకముల మిశ్రం	6

నిబంధనలు పాటిస్తేనే గిట్టుబాటు ధర..

-రామకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి, కాగజ్‌నగర్

ఈనెల 21నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. రైతులు నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలి. ఈ నిబంధనలను పాటిస్తేనే గిట్టుబాటు ధర వచ్చే అవకాశాలున్నాయి.

గ్రామాల్లో వైద్యశిబిరం

కెరమెరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందాపూర్, దేవుడుపల్లి, నిశాని గ్రామాల్లో కెరమెరి, వాంకిడి వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో మెడికల్‌క్యాంపు ఏర్పాటు చేసి పలువురికి వైద్య చికిత్స చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీకాంత, ఆరోగ్య విస్తర్ణ అధికారులు రోహిదాస్, శ్యాంనాయక్, ఐసీడీఎస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు వైద్యం చేస్తున్న వైద్యసిబ్బంది



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఖాతాదారులకు అవగాహన సదస్సు

కెరమెరి, అక్టోబరు 18: మండలకేంద్రంలో శుక్రవారం తెలంగాణ గ్రామీణబ్యాంకు ఆధ్వర్యంలో గ్రామీణప్రజలకు, రైతులకు, వినియోగ దారులకు బ్యాంకు లావాదేవీల నిర్వహణపై సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ త్రిపాల్ మాట్లాడుతూ ఫేక్ కాల్స్‌ను వినియోగదారులు నమ్మవద్దని, నేరుగా బ్యాంకుకు వచ్చి లావాదేవీలు జరుపుకోవాలని సూచించారు.

ఎంఈవో, ఉపాధ్యాయులకు సన్మానం

కౌటాల, అక్టోబరు 18: మండల ఎంఈవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన హనుమంతును, కొత్తగా ఉపాధ్యాయులుగా చేరిన అయిదుగురిని శుక్రవారం ముత్తంపేట సాంఘికశాస్త్ర సముదాయ సమావేశంలో ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు, సిర్పూర్(టి) మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంఈవోను, నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా

● పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

రెబ్బెన, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రయివేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీఅభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. శుక్రవారం రెబ్బెనలోని అన్నపూర్ణ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ప్రయివేటు ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో ప్రయివేటు ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నెలకు రూ.2వేలు, 25కిలోల బియ్యం ఇప్పించినట్టు గుర్తుచేశారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెల్పించాలని కోరారు. రానున్న రోజుల్లో తప్పకుండా ప్రయివేటు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో ట్రస్మా రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, ప్రధానకార్యదర్శి బితిరు పతిచారి, కోశాధికారి బి రాజేంద్రప్రసాద్, మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, ట్రస్మాసభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమావేశం

గర్మిళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐబీ చౌరస్తా ఆవరణలో శుక్రవారం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికసంఘం జనరల్‌బాడీ సమావేశాన్ని జిల్లాప్రధాన కార్యదర్శి ఆవునూరి గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. కార్మికుల పీఎఫ్‌లో తప్పులు సవరించాలని, కేంద్రప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అక్రమంగా పెట్టిన పేర్లను తొలగించాలని చర్చించారు.

కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగసంఘం నాయకుడు రాజన్న, తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికసంఘం జిల్లాగౌరవాధ్యక్షుడు దేవిసత్యం, ఉపాధ్యక్షుడు లింగయ్య, రాజమల్లు, సతీస్, రాయమల్లు, సత్యనారాయణ, నర్సయ్య, సతీష్, మల్లేష్‌నర్సయ్య, రాజేష్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

జన్నారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జన్నారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సైకియాట్రిస్టు సునీల్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మనస్సును ఎప్పుడు ప్రశాంతంగా ఉంచుకోవాలని, ఒత్తిడికి గురికావద్దని సూచించారు.

రోజు వ్యాయామం, యోగాచేయాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఅధికారి కరుణాకర్, అధ్యాపకులు బాపురావు, రవీందర్, మోహన్, దేవేందర్, సాయికుమార్, కుమారస్వామి,స్వరూప, శశికళ పాల్గొన్నారు.

చెరువు మత్తడి ధ్వంసంతో తనకు సంబంధం లేదు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శనగకుంట చెరువు మత్తడి ధ్వంసం కేసులో తనకు సంబంధం లేదని కోటపల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోడిసెల బాపురెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద భూమి కొనుగోలు చేశానన్నారు. భూమి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉండడంతో 15 ఎకరాల భూమికి 4.20 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యిందన్నారు. భూమి విక్రయించిన వారిని డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేశానన్నారు. మత్తడి ధ్వంసంతో నాకు ఎలాంటి సంబంధం లేదని, పోలీసులకు సహకరించానని పేర్కొన్నారు. నాపై, ఎమ్మెల్యే వివేక్‌పై బీఆర్ఎస్ పార్టీ నాయకులు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. కేసులో నా ప్రమేయం ఉందంటూ ప్రెస్‌మీట్‌లు పెట్టడం, సోషల్ మీడియా పోస్టులు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూరు కోటపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పేరిట బెల్ట్‌షాపుల ఏర్పాటు

జైపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కుందారం గ్రామ అభివృద్ధి పేరిట కొందరు ఎక్సైజ్ అధికారులతో కుమ్మక్కై రూ.7.40 లక్షలకు రెండు బెల్టు షాపులు, సిట్టింగ్ పాయింట్లకు అక్రమ టెండర్లు నిర్వహించినట్లు వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కొందరు ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని ఎక్సైజ్ శాఖ అధికారుల అండదండలతో గ్రామపంచాయతీకి సంబంధం లేకుండా బెల్ట్ షాపులు, సిట్టింగ్ పాయింట్లకు టెండర్లు నిర్వహించారు. యేటా ఆ ఇద్దరు వ్యక్తులకే బెల్టుషాపు, సిట్టింగ్ పాయింట్‌ల నిర్వహణకు టెండర్లు ఎలా దక్కుతాయని ప్రశ్నిస్తున్నారు. అక్రమ టెండర్ల ద్వారా మద్యం అమ్ముతున్న బెల్టు షాపుల నిర్వాహకులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌ను వివరణ కోరగా గ్రామపంచాయతీకి సంబంధం లేదని పేర్కొన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి

హాజీపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోజు పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లాపంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం హాజీపూర్‌లో మాట్లాడుతూ మురికి కాలువలు, రోడ్లను శుభ్రం చేయాలని, ఇంటింటికి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. ఇంటి పన్నులను నెలాఖరులోగా వంద శాతం వసూలు చేయాలన్నారు.



కార్మికులకు క్వార్టర్లు శాశ్వతంగా ఇవ్వాలి



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు వారు ఉంటున్న క్వార్టర్లను శాశ్వతంగా ఇవ్వాలని హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏరియాలోని కేకే5 గనిపై కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కార్మికులు మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు పనిచేసి పదవీ విరమణ పొందితే క్వార్టర్లు ఖాళీచేస్తేనే కంపెనీ బెనిఫిట్స్ ఇవ్వడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింగరేణివ్యాప్తంగా 70వేల క్వార్టర్లు ఉన్నాయని, కానీ కార్మికుల సంఖ్య 40వేలు ఉందన్నారు. 30వేల క్వార్టర్లు వృథాగా ఉన్నట్టే కదాఅని పేర్కొన్నారు. సమావేశంలోనాయకులు సుదర్శన్, శ్రీనివాస్, రామస్వామి,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ యువతను ప్రోత్సహిస్తుంది

రెబ్బెన, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధియే కాకుండా సమీప గ్రామాల నిరుద్యోగ యువతకు ప్రభుత్వ కొలువులు సాధించేందుకు సింగరేణి సంస్థ అన్ని విధాల ప్రోత్సహిస్తుందని బెల్లంపల్లి జీఎం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాయంలో ఉపాధ్యాయ కొలువుకు ఎంపికైన వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్, గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, పీఈ వీరన్న, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న జీఎం శ్రీనివాస్

పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని

రెబ్బెన, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడలో నెలకొన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బయ్యా మొగిలి, పిట్‌కార్యదర్శి మారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖైరిగూడ యాక్టింగ్ మేనేజర్ నారాయణతో కలిసి పెండింగ్ సమస్యలపై చర్చించారు. క్యాంటీన్‌లో నెలకొన్న సమస్యలపై వివరించారు. అలాగే పర్సన్ రికార్డ్స్, ఈపీఆర్ ఫ్యామిలీ ఫొటోలు అప్‌డేట్ చేయటంలో టెక్నికల్ సమస్యలు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ పర్సన్‌మేనేజర్ నాగుల వేణు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషశినారావు, రాజేష్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, సముద్రాల ఆనంద్, దేవరకండ దివాకర్, సహాయకార్యదర్శిగా మాల ఓదెలు, తుంతగల వెంకటేష్, పుట్ట అంజయ్య, నాయకులు సత్యనారాయణ, రారాజు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీవి అసత్య ప్రచారాలు

కాసిపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ కార్మికులను తప్పుదోవ పట్టించేందుకు అసత్యప్రచారాలు చేస్తోందని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్, మందమర్రి బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు.

కార్మికులు మూడు రోజులు గైర్హాజరైతే జీఎం నుంచి అనుమతి పత్రం తీసుకురావాలని నిబంధన పెడితే ఏఐటీయూసీ పోరాటాలు చేసిదాన్ని రద్దు చేయించిందన్నారు. కానీ ఇది ఐఎన్‌టీయూసీ వల్లనే సాధ్యమైందని ప్రచారంచేస్తూ కార్మికులను మోసం చేస్తోందని, దీన్ని కార్మికులు గమనించాలన్నారు.

సర్క్యులర్ రద్దు చేసిన యాజమాన్యం

మందమర్రిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో కార్మికులు మూడురోజులపాటు విధులకు గైర్హాజరైతే జీఎంను కలిసి డ్యూటీ అలోస్లిప్ తీసుకోవాలనే సర్క్యులర్‌ను రద్దు చేయించామని ఏఐటీయూసీ బ్రాంచిసెక్రెటరీ సత్యనారాయణ తెలిపారు.

శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ సర్క్యులర్‌ను గుర్తింపుసంఘంగా తాము పూర్తిగా వ్యతిరేకించి యాజమాన్యానికి వివరించామన్నారు. దీంతో ఏరియా జీఎం దీన్ని రద్దు చేశారని తెలిపారు. కార్మికవ్యతిరేక చర్యలను గుర్తింపు సంఘం ఎండగడుతుందని, కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు.

నేడు బాలికల కబడ్డీ ఎంపిక ప్రక్రియ

తాండూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి అండర్ 17 ఎస్‌జీఎఫ్ బాలికల కబడ్డీ ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలలోపు విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 98492 34865లో సంప్రదించాలన్నారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి

కాసిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే అన్నిరంగాల్లో ముందుంటారని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సాయికృష్ణ అన్నారు. శుక్రవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు బ్యాంకు ద్వారా అందించే రుణాలను సద్వినియోగం రుణాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. బీమా, పొదుపు, ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. సునీల్, శారద, అమృత పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

రామకృష్ణాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక 19వ వార్డులో ప్రభుత్వ స్థలంలో కాలనీ వాసులు దేవీ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక మండపాన్ని తొలగించాలని కొందరు మున్సిపల్ కార్యాలయంలోకి చొరబడి పెట్రోల్ బాటిళ్లతో బెదిరించడం సరికాదన్నారు. తాత్కాలిక మండపం అదే విధంగా కొనసాగించవచ్చని, ఎక్కువ స్థలంలో నూతన ఏర్పాట్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రజల సౌకర్యార్థం అదే స్థలంలో ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్ ప్రతిపాదించామన్నారు. కార్యాలయంలోకి పలువురు చొరబడటంతో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య చొరవతో పరిస్థితి కొలిక్కి వచ్చింది.

మారుతున్న ఆహార అలవాట్లు



జొన్న రొట్టెలను తయారు చేస్తున్న నిర్వాహకులు

- చిరుధాన్యాలపై ఆసక్తి
- ఆరోగ్యానికి పెద్దపీట
- జొన్న రొట్టె, రాగిజావలకు గిరాకీ

ఆహార అలవాట్లు మారుతున్నాయి... చిన్న వయసులోనే బీపీ, షుగర్ తదితర వ్యాధుల బారిన పడుతుండడంతో ప్రజలు ఆహారం అలవాట్లను మార్చుకుంటున్నారు. చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, జొన్న రొట్టెలు, రాగి జావ, జ్యూస్‌లు తీసుకుంటున్నారు. మన పూర్వీకులు స్వీకరించిన ఆహారంపై ప్రస్తుతం ఆసక్తి పెరుగుతోంది...

బెల్లంపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. ఇటీవల కాలంలో అందరు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలపై ఆసక్తి చూపుతున్నారు. ఆయా రంగాల్లో ఉన్న పని ఒత్తిడి, సంపాదన కోసం ఉరుకులు పరుగుల జీవితంలో వయస్సుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. వీటి బారిన పడకుండ కొందరు, బీపీ, షుగర్ ఉన్న వారు నియంత్రణలోకి తెచ్చుకోవాలని ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. జొన్నరొట్టె, రాగిసంగటి, అంబలి, గంజి, దంపుడు బియ్యం, గట్కు, సర్వపిండితో పాటు వివిధ రకాల పండ్లు, జ్యూస్‌లను తీసుకుంటున్నారు. దీంతో పాటు జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ వంటి వాటికి దూరంగా ఉంటున్నారు.

విరివిగా వెలుస్తున్న జొన్నరొట్టె సెంటర్‌లు

జొన్నరొట్టె ఎక్కువగా పల్లె ప్రజలు తినేవారు. క్రమంగా అన్నం అలవాటు చేసుకోవడంతో జొన్నల వినియోగం తగ్గిపోయింది. ఆహార అలవాట్లలో వస్తున్న మార్పులతో జొన్నరొట్టెకు డిమాండ్ పెరుగుతోంది. జొన్నరొట్టెలు తిందామని ఆసక్తి ఉన్నా ఇండ్లలో చేయరాకపోవడం, సమయం లేకపోవడంతో జొన్న రొట్టె సెంటర్‌లను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో జొన్న రొట్టెల సెంటర్‌లు వెలుస్తున్నాయి. గోధుమ రొట్టెలను సైతం అమ్ముతున్నారు. ఒక్కో రొట్టెను రూ. 10 నుంచి 15 వరకు విక్రయిస్తున్నారు. రొట్టెలతోపాటు కూరలు కూడా అమ్ముతుండడంతో రాత్రి రొట్టెలు తినడానికి ఆసక్తి చూపుతున్నారు.



బెల్లంపల్లిలోని రాగి జావ బండి

చిరుధాన్యాలకు భలే డిమాండ్...

జొన్నలు, సజ్జలు, కొర్రలు, రాగులు, పరిగెలు, కుసుములు వంటి చిరుధాన్యాలతో చేసిన వంటకాలకు డిమాండ్ పెరుగుతోంది. అందరు ఆహారంలో ఇవి ఉండేలా చూసుకుంటున్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని కిరాణం షాపులు, మార్ట్‌లలో సైతం అందుబాటులో ఉంచుతున్నారు. వైద్యులు సైతం చిరుధాన్యాల్లో బీ 12, ఇతర విటమిన్‌లు ఉంటాయని, ఆహారంలో తీసుకోవాలని సూచిస్తుండడంతో డిమాండ్ పెరుగుతుంది.

మొలకెత్తిన గింజలపై ఆసక్తి..

మొలకెత్తిన పెసర, బబ్బెర గింజల్లో ప్రొటీన్ ఎక్కువగా లభిస్తుందనే ఆలోచనతో రోజు మొలకెత్తిన గింజలను తీసుకుంటున్నారు. డ్రైఫ్రూట్స్, పండ్లు, జ్యూస్‌లను తీసుకుంటున్నారు. ప్రజలు వీటిపై ఆసక్తి చూపుతుండడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా జ్యూస్ సెంటర్లు, మెడికల్, కిరాణం దుకాణాలు, మార్ట్‌లలో మొలకెత్తిన విత్తనాలు, డ్రైఫ్రూట్స్ లభిస్తున్నాయి.

ఆరోగ్యానికి మేలు చేస్తుంది



చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు వయస్సుతో సంబంధం లేకుండా అందరికి ఎంతో మేలు చేస్తాయి. ప్రొటీన్‌లు, మంచి పోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవు. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన వస్తుండడంతో బలమైన ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. అంబలి, జొన్నరొట్టె వంటివి తీసుకోవడం వల్ల మధుమేహం, గుండెజబ్బులు రాకుండా వీలుంటుంది. వీటితో పాటు శారీరక శ్రమ చేస్తే మంచిది.

- రవి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, బెల్లంపల్లి

ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నాను



జొన్నరొట్టె, గట్కు, అంబలి వంటి ఆహారం రోజు ఇచ్చేవారు. రోజు చిరుధాన్యాల ఆహారం తీసుకుంటాను. దీంతో నేను ఇప్పటి వరకు ఆయాసం లేకుండా నా పనులు నేను చేసుకోవడమే కాకుండా శారీరక శ్రమ చేస్తాను. పిల్లలను జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచి చిరుధాన్యాల ఆహారం అలవాటు చేస్తే మంచిది.

- సత్యనారాయణ, బెల్లంపల్లి

జొన్న రొట్టె, రాగిజావ తీసుకుంటాను



జొన్నరొట్టెలు, రాగిజావ, అంబలి అందుబాటులోఓ ఉండడంతో రోజు తీసుకుంటున్నాను. మంచి ఆహారం అలవాట్లను చేసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నాను. వైద్యులు సైతం అదే విధంగా సూచిస్తుండడంతో రోజు ఆహారంగా తీసుకుంటున్నాను.

- సుదర్శన్

డిమాండ్ పెరిగింది



జొన్న రొట్టెలు అమ్ముతుంటాను. ఇటీవల కాలంలో ప్రతీ ఒక్కరు జొన్న, గోధుమ రొట్టెలపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో రొట్టెలకు తక్కువ గిరాకీ అయ్యేది. ప్రస్తుతం మంచి డిమాండ్ ఏర్పడింది.

- ఆరే స్వరూప, బెల్లంపల్లి

వ్యవసాయం

అధిక సాంద్రతతో అధిక దిగుబడులు



పంటలను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

బెల్లంపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల దిగుబడులు గణనీయంగా పెరుగుతున్నాయని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ అన్నారు. శుక్రవారం మాల గురిజాల గ్రామంలో జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగ్‌పూర్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రతలో సాగు చేసే పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 420 ఎకరాల్లో రైతు క్షేత్రాలను పరిశీలించామన్నారు. ఇందులో భాగంగా మాల గురిజాలలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తున్న దుర్గం సుమన్, కె.సంతోష్‌ల క్షేత్రాలను పరిశీలించి సూచనలు అందించా మన్నారు. శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ప్రియాంక, శైలజ, అనిల్, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో పూత కాత దశే కీలకం

భీమారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పత్తిలో పూత కాత దశే కీలకమని వ్యవసాయ సహాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం దాంపూర్‌లో ఏఈవో అరుణ్‌కుమార్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పత్తి పంటలను పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగులతోపాటు లద్దె పురుగులను రైతులు ఎప్పటికప్పుడు గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. రైతులు శీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నెన్నెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. ఏవో, ఏఈవోలతో కలిసి నెన్నెల శివారు పంట పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. పంటల్లో తెగుళ్లు, చీడపీడలు ఉంటే రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రసాయనాలను తగిన మోతాదులో వేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి పుప్పాల సృజన, ఏఈవో రామ్‌చందర్ ఉన్నారు.

జాతీయ విద్యా ప్రతిభ అవార్డుకు ఉపాధ్యాయుడి ఎంపిక



ప్రవీణ్

కాసిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా ప్రతిభ అవార్డుకు కాసిపేట మోడల్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ ఎంపికయ్యాడు. ప్రవీణ్ కొంతకాలంగా విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్నాడు. నాసా నిర్వహించిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్నేషనల్ సైన్స్‌లో పాల్గొన్నాడు. ఐదు సార్లు రాష్ట్రస్థాయి చెకుముఖి బాలల సైన్స్ పోటీల్లో విద్యార్థులతో పాల్గొని అవార్డులు సాధించాడు. 2013 నుంచి 2024 వరకు 95మంది విద్యార్థులను నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యే విధంగా శిక్షణ ఇచ్చాడు. ఢిల్లీకి చెందిన ఐఫెడ్ గ్రూపు సంస్థ నేషనల్ ఎడ్యుకేషన్ బ్రిలియన్స్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును నెలాఖరులోగా ఢిల్లీలో అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జికి సన్మానం



అర్పిత మారంరెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

లక్షెట్టిపేటరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి అర్పిత మారం రెడ్డి బదిలీపై జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శిగా (మంచిర్యాల)కు వెళ్తున్న సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. జూనియర్‌ సివిల్ జడ్జి అసదుల్లాషరీఫ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్, ఏజీపీ వేల్పులసత్యం, కార్యదర్శి రాజేశ్వర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన జయకృష్ణారెడ్డిని శుక్రవారం సన్మానించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ సారాతస్లీమ్ సన్మానించారు.

స్పోర్ట్స్

ఫెన్సింగ్ ఎంపిక పోటీలు పూర్తి

- ఎంపికైన క్రీడాకారుల జాబితా విడుదల



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

శ్రీరాంపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా అండర్ 14, 17, 19 ఎంపిక పోటీలు పూర్తయినట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య కార్యదర్శులు చెరుకు ఫణిరాజా, బాబురావు అన్నారు. అనంతరం ఎంపికైన క్రీడాకారుల జాబితాను వెల్లడించారు. వీరందరికి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్, చెరుకు అనిల్, సీనియర్ క్రీడాకారులు ఈదునూరి వెంకటేశ్, ఎర్ర కిశోర్, పీఈటీలు రాజేందర్, కుమార్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 బాలికలు : నిక్షిత, సనా, క్షేత్ర, వైష్ణవి, లావణ్య, సుహానా, హిమసీరెడ్డి, ఆరాధ్య యోగితాశ్రీ, నిత్యాశ్రీ, శ్రీవల్లి, వైష్ణవి ఎంపిక కాగా, స్టాండ్ బైగా విష్ణుప్రియ, అయేషా ఫాతిమా ఉన్నారు.

అండర్-14 బాలురు : రిత్విక్ రెడ్డి, సిద్ధార్థ, అయాన్ ఖాన్, సాయి యశ్వంత్, అర్షిత్, రిషిచరణ్, శ్రీహాస్ పటేల్, పూర్ణసాయి, శ్రీచరణ్, సాత్విక్, ఆదిత్య, మణిదీక్షిత్ ఎంపికయ్యారు.

అండర్-17 బాలికలు : వెన్నెల, శ్రావ్య, అర్చన, సమోజ్‌వాలా, ఐశ్వర్య, జ్యోతి, సాయిశృతిక, దీక్షిత, వైష్ణవి ఎంపికయ్యారు.

అండర్-17 బాలురు : రాజ్, హర్షవర్ధన్, జశ్వంత్, మనీష్, రోషన్, వెంకటసాయి, అశ్విత్, సిద్ధార్థ్, సాత్విక్, అనికేత్, సంజయ్ ఎంపిక కాగా, స్టాండ్‌బై గా రాజేందర్, హన్షిత్, మణిదీక్షిత్ ఉంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

అండర్-17 ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ సెక్రెటరి రాంమోహన్, క్రికెట్ కోచ్ ప్రదీప్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో 100 మంది బాలురు, 20 మంది బాలికలు తలపడ్డారు. ఆర్గనైజర్ సిరంగి గోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు రేణి రాజయ్య, విట్టల్, నందం శ్రీనివాస్, దుబ్బ శ్రీనివాస్, స్టీఫెన్ రవీంద్ర, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఆర్గనైజర్లు

ర్యాలీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు



బ్రిడ్జి మంజూరు పత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

హాజీపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముల్కల్లలోని ర్యాలీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావుకు ముల్కల్ల గ్రామ రైతులు శుక్రవారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే బ్రిడ్జికి నిధులు మంజూరైన పత్రాన్ని రైతులకు చూపించారు. అనంతరం గ్రామంలో రైతులు బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. బ్రిడ్జి నిర్మాణంతో తమ కష్టాలు తీరుతాయని రైతులు పేర్కొన్నారు. నాయకులు గోనె సతీష్ రావు, మోటలుకుల రమేష్, రామయ్య, లక్ష్మణ్, సతీష్ యాదవ్, కుమార్‌యాదవ్, కిషన్, రాజయ్య, తిరుపతి,వెంకటేష్ రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు 'అమృత కలశం'

- పదేళ్ల క్రితం సత్యసాయి భజన మండలి ఏర్పాటు
- నిరుపేదలకు నిత్యావసర సరుకుల అందజేత
- అటు ఆధ్యాత్మికం.. ఇటు సేవానిరతి



ఊట్ల గిరిజన గ్రామంలో గిరిజన పిల్లలకు అన్నదానం చేస్తున్న సత్యసాయి భజన మండలి నిర్వాహకులు



పేదలకు బట్టలు అందజేస్తున్న ..

దండేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందిస్తూనే నిరుపేదలకు అండగా ఉంటోంది దండేపల్లికి చెందిన సత్యసాయి భజన మండలి. పదేళ్ల క్రితం దండేపల్లిలో ఏర్పాటు చేసిన సత్యసాయి భజన మండలి నెలనెలా నిత్యవసర సరుకులు అందిస్తోంది. గిరిజన పల్లెలో అన్నదానం, దుస్తులు, వైద్యం అందుబాటులో లేనిచోట్ల వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. సత్యసాయి భజనమండలిలో ప్రస్తుతం 30మంది సభ్యులు ఉన్నారు. స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతూ గ్రామంలో ప్రతీ గురువారం ఒక్కొక్కరి ఇంట్లో సత్సంగం పేరిట భజనలు, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితమైన భజన మండలి సభ్యులు నాలుగేళ్ల నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు, పేదలకు అండగా ఉంటున్నారు.

నిరుపేద కుటుంబాలకు అమృత కలశం

సత్యసాయి భజన మండలి సభ్యులు కొంత సొమ్ము జమ చేశారు. దీంతో పాటు ఎవరైనా దాతలు ముందుకు వస్తే వారి నుంచి విరాళం సేకరించి పేద కుటుంబాలకు నెలనెలా నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. ఒక్కో నిరుపేద కుటుంబానికి బియ్యంతోపాటు సరుకులు, పిల్లలు ఉంటే బుక్‌లు, పెన్నులు, విద్య సామాగ్రిలతో కూడిన అమృత కలశంగా భజన మండలి నిర్వాహకులు పేదకుటుంబాలకు అందజేస్తూ అండగా ఉంటున్నారు.

గిరిజన పేదలకు అండగా ఉంటూ..

మండలంలోని వివిధ గిరిజన గ్రామాల్లో తిరిగి వారికి అండగా ఉంటూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైద్యం అందుబాటులో లేని గిరిజన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులను పంపిణీ చేస్తున్నారు. సత్యసాయిబాబా జయంతి, పండుగల సందర్భంగా పలుమార్లు గిరిజన గ్రామాల్లో అన్నదానాలు, దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్నారు.

సమాజసేవలో పాలుపంచుకోవాలి



ప్రతీ ఒక్కరు సమాజ సేవలో పాలు పంచుకోవాలి. పదేళ్ళుగా గ్రామాల్లో భక్తి భావం కల్పిస్తూనే పేద కుటుంబాలను ఆదుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. పేదల పట్ల ప్రేమ, సేవ గుణాలు కలిగి ఉండి వారికి చేయూతనివ్వాలన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తామన్నారు.

- రాపర్తి రాజన్న సత్యసాయి భజన మండలి కన్వీనర్ దండేపల్లి

దాతలు సహకరిస్తే పేదలకు అండగా ఉంటాం



సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందిస్తునే వస్తున్నాం. ఎవరైన దాతలు ముందుకు వస్తే మరింత పేద కుటుంబాలకు అమృత కలశాలను అందజేస్తాం. పేదలకు సేవ చేయడంలోనే ఎంతో తృప్తి ఉంది.

- పసుపునూటి సత్తయ్య భజన మండలి సేవ దళ్ కోఆర్డినేటర్

రుణమాఫీ కోసం ఎదురుచూపులు

- నియోజకవర్గంలో రెండు లక్షల రుణమాఫీ కాని రైతులు ఆరు వేల మంది
- పూర్తైన ఆధార్, రేషన్ కార్డు అనుసంధాన ప్రక్రియ
- దీపావళి లోపు రుణమాఫీకి చర్యలు



కాగజ్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.లక్ష లోపు ఉన్న వారందరికీ రుణమాఫీ చేసింది. అది కూడా రెండు విడుతల్లో పూర్తిచేసింది. ఇక రూ.2లక్షలు ఉన్న వారికి రుణమాఫీ చేయాల్సి ఉంది. నెలరోజు క్రితమే రూ.2లక్షల రుణం గల వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు లింకేజీ లేకపోవటం, బ్యాంకు ఖాతాలో ఒక పేరు, రైతు పాస్‌పుస్తకంలో మరోపేరు వచ్చిన వారి జాబితాను తీసుకొని వ్యవసాయా శాఖ అధికారులు సరిచేశారు. అలాగే రేషన్‌కార్డులు లేనివారి ఇంటి వద్దకే వెళ్లి ఫొటోలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. రూ.2లక్షల తీసుకున్న రైతులందరి జాబితాను క్లియర్‌చేసి అప్‌లోడ్ చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావటంతో రుణమాఫీ కోసం రైతులంతా ఎదురుచూస్తున్నారు. రెండ్రోజుల క్రితం నల్లగొండలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రూ.2లక్షల రుణాలున్న రైతులందరికీ దీపావళిలోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో ఈ ప్రాంత రైతులు రుణమాఫీ అవుతుందన్న సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో రూ.2లక్షలు పైన రుణం తీసుకున్న రైతుల సంఖ్య 6వేలకుపైగా ఉంది. వీరందరికి కూడా రుణమాఫీ కోసం వేచి చూస్తున్నారు.

● వివరాలు సమర్పించిన రైతులు..

రైతు రుణమాఫీ కోసం రైతులు పూర్తి వివరాలను సమర్పించారు. కొన్ని సాంకేతిక కారణాలు తలెత్తిన నేపథ్యంలో రైతు రుణమాఫీ నిలిచిపోయింది. కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయాశాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేకకౌంటర్లలో రైతులకు సమాచారం అందించారు. అలాగే జిల్లాలో కూడా ఇదే తరహాలో పూర్తివివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. రూ.2లక్షల వరకు ఉన్న వారికి రుణమాఫీకి ఇచ్చేట్టు అధికారులు క్లియరెన్స్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మ నాగేశ్వర్‌రావు ప్రకటన నేపథ్యంతో రైతులకు రుణమాఫీపై భరోసా కలిగింది. ఈ ప్రక్రియ కాగానే రూ.2లక్షల దాటిన వారికి కూడా క్లియరెన్స్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా రుణమాఫీ త్వరగా చేయాలని ఆయాగ్రామాల రైతులు ఎదురుచూస్తున్నారు.

ఆన్‌లైన్ సమస్యను పరిష్కరించాం..

- రామకృష్ణ, వ్యవసాయాధికారి

రైతు రుణమాఫీ విషయంలో ఆన్‌లైన్‌లో వచ్చిన సమస్యను క్లియరెన్స్ చేశాం. అలాగే రేషన్ కార్డు లింకు లేని వారి ఇంటివద్దకే వెళ్లి ఆన్‌లైన్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేశాం. రైతు రుణమాఫీకి సంబంధించిన రైతు వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం.

స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఆసిఫాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్‌బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీంలను ఇన్సురెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని శుక్రవారం కలెక్టరేట్‌ఎదుట భవననిర్మాణ కార్మికులు ధర్నాచేశారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రాంమోహన్ మాట్లాడుతూ బోర్డు అడ్వైజరీకమిటీని నియమించి ప్రభుత్వమే బోర్డుద్వారా సంక్షేమపథకాలను కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. భవననిర్మాణ కార్మికసంక్షేమపథకాలను ఇన్సురెన్స్‌కంపెనీలకు ఇవ్వొద్దన్నారు. ప్రమాదమరణానికి రూ.10లక్షలు, సహజమరణానికి రూ.5లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతివివాహకానుకలను రూ.లక్షకు పెంచాలన్నారు. ఖాళీగాఉన్న ఏఎల్, ఏసీఎల్, డీసీఎల్, జూనియర్, సీనియర్‌అసిస్టెంట్ పోస్టులను భర్తీచేయాలని తదితర డిమాండ్లుచేశారు.లేనిపక్షంలో ఆందోళనచేస్తామన్నారు. అనంతరంకలెక్టర్‌కు వినతిపత్రంఅందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూనాయకులు శ్రీనివాస్, రాజేందర్, కమలాకర్, బాలకిషన్, కృష్ణమచారి, రాములు, రవి, గౌస్‌బాబా, విలాస్, మదుకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కుమరం భీం జన్మస్థలం రౌటసంకెపల్లిలో నిర్వహించే కుమరం భీం, ఎడ్లకొండు వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. శుక్రవారం వర్ధంతిసభ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, శ్రీనివాస్, కిష్టయ్య రాజు, సుధాకర్, అర్జున్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

- రౌటసంకెపల్లిలో ఈనెల 21, 22తేదీల్లో నిర్వహించే కుమరం భీం, ఎడ్లకొండు వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు కోరారు. శుక్రవారం వర్ధంతి సభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్‌యాదవ్, మంగ, పెంటయ్య, కిష్టయ్య, రాజు, సుధాక్, అర్జు, మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఈనెల20న హైదరాబాద్ ఎల్బీనగర్‌లో నిర్వహించే పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లాఅధ్యక్షుడు అంజనేయులు కోరారు. శుక్రవారం సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లయ్య, లింగయ్య, ధర్మయ్య, శ్రీకాంత్, రమేష్, తిరుపతి, లక్ష్మినారాయణ, చందు, వెంకన్న, సంజీవ్, మంగ, విజయ, పుష్ప, జయ, సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కెరమెరి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం11నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు.వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ఓవర్సీస్ విద్యానిధి పథకంకింద విదేశాలలో ఉన్నత చదువులకు అందించే ఆర్థికసహాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువుతేదీని ఈనెల29వరకు పొడగించినట్లు షెడ్యూల్‌కులాల అభివృద్ధి అధికారి సజీవన్ ఒకప్రకటనలో తెలిపారు. అమెరికా,ఇంగ్లాండ్, స్విట్జరాండ్ కెనడా, న్యూజిలాండ్, సింగాపూర్, సౌత్‌కొరియా తదితర దేశాల్లో ఉన్నత చదువుల కోసం వెళ్లవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రూప్-2,3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- వీసీలో టీజీపీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు, సబ్ కలెక్టర్‌లు, ఏఎస్పీ

ఆసిఫాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రూపు-2, గ్రూపు-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని టీజీపీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్‌పబ్లిక్‌సర్వీస్ కమిషన్ కార్యాలయం నుంచి ఇతర కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులతో కలిసి వీసీ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్, అదనపుఎస్పీలతో పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రూపు-2 పరీక్ష డిసెంబరు15, 16 తేదీల్లో, గ్రూపు-3 పరీక్షలు నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. అధికారులు పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్‌రూంలను గుర్తించి ఏర్పాటు చేయాల్సిన వసతులు, చర్యలపై పూర్తివివరాలతో నివేదిక అందించాలని ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో 18 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 4500మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. కాగజ్‌నగర్‌లో 9 కేంద్రాలు, ఆసిఫాబాద్‌లో 9కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షలకు నోడల్ అధికారులుగా అదనపు కలెక్టర్, పోలీసు నోడల్ అధికారిగా ఏఎస్పీలు వ్యవహరిస్తారని అన్నారు. ప్రశ్నపత్రాల భద్రతకు కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా సాగేలా అధికా రుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో ప్రశ్నాపత్రాలు భద్రపరిచే కలెక్టరేట్ లోని స్ట్రాంగ్ రూంను అదనపు కలెక్టర్‌లు, ఏఎస్పీలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణు, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, సమన్వయకర్త లక్ష్మినర్సింహా, అదనపు సమన్వయకర్త రాజేశ్వర్, జిల్లాఖజానా అధికారి భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం 2024-25సంవత్సరానికి గాను వరిధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వంజీరి గ్రామ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వానాకాలానికి సంబంధించి రానున్న వరిధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి 500 బోనస్ ఇస్తున్నట్టు తెలిపారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వరి పూర్తిగా ఎండిన తర్వాత కోతలు మొదలు పెట్టాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతుకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా తేమశాతంపై ఆందోళన ఉండదని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ప్రదేశాలను ముందుగానే గుర్తించి పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తూకం ప్రక్రియ పూర్తి అయిన వెంటనే జిల్లాలో ట్యాగింగ్ చేయబడిన రైస్‌మిల్లులకు ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, అసలత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేణు, సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా వ్యవసాయాశాఖ అధికారి శ్రీనివాసరావు, డీఎస్పీ రామానుజం, జిల్లా సహకారశాఖ అధికారి రబ్బాని, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

మెట్‌పల్లి బ్రిడ్జికి మోక్షమెప్పుడో?

- నిధుల కేటాయింపు లేక పనులకు బ్రేక్
- పట్టించుకోని నాయకులు, అధికారులు




కాగజ్‌నగర్-వాంకిడి మధ్యలో పిల్లర్ల స్థాయి వీడని బ్రిడ్జి పనులు

కాగజ్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండలాలకు అనుసంధానంగా ఉన్న బ్రిడ్జిని పూర్తి చేయటం లేదు. నిధులు విడుదల కాకపోవటంతో ఎక్కడవేసిన గొంగలి అక్కడే ఉన్న చందంగా మారింది. కాగజ్‌నగర్-వాంకిడి మండలాలకు అనుసంధానంగా ఉండేందుకు మెట్‌పల్లి గ్రామసమీపంలోని వాగుపై బ్రిడ్జినిర్మాణంకోసం 2013లో రూ.1.50 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. అయితే నిధుల విడుదలలో జాప్యం చేయటంతో పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ మార్గంలో కేవలం ఎండాకాలం, చలికాలం మాత్రమే రాకపోకలుంటున్నాయి. వర్షాకాలం మాత్రం పూర్తిగా రాకపోకలు సాగని పరిస్థితి ఉంది. ఈమధ్యలో ఉన్న వాగుఉప్పొంగి ప్రవహిస్తుండటమే ఇందుకుకారణం. నిధులుపూర్తిస్థాయిలో ప్రభుత్వాలు కేటాయించక పోవటంతో నిర్మాణదశ వీడటం లేదు.

వాంకిడికి 25కిలోమీటర్ల దూరమే..

కాగజ్‌నగర్ నుంచి వాంకిడికి వెళ్లాలంటే ఆసిఫాబాద్ మీదుగా వాంకిడికి వెళ్లేందుకు 41కిలోమీటర్ల దూరం ఉంది. కానీ కాగజ్‌నగర్-అంకుసాపూర్-వాంకిడి ఈ మార్గంలో కేవలం 25 కిలోమీటర్ల దూరమే ఉండటంతో అధికారులు, నాయకులు అంకుసాపూర్ సమీపంలోని మెట్‌పల్లి వాగుపై వంతెన నిర్మించేందుకు 2013లో పనులు ప్రారంభించారు. ఏటా నిధులు విడుదల కావటం లేదు. నిర్మాణ మెటిరియల్ ధరలు పెరుగటంతో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టలేమని కాంట్రాక్టర్ ప్రభుత్వానికి తెలియజేశాడు. దీంతో మళ్లీ అదనంగా ఎస్టీమేషన్లు చేసి పంపించారు. ఇంత వరకు పూర్తి స్థాయిలో నిధులు కాకపోవటంతో పనులను చేయకుండా ఆపేశారు. బ్రిడ్జి పిల్లర్ల స్థాయిని వీడ లేదు.

నాయకులు, అధికారులు స్పందిస్తేనే..

ప్రభుత్వాలు మారుతున్న కూడా ఈ బ్రిడ్జికి ఇంతవరకు నిధులు పూర్తిస్థాయిలో కేటాయించటం లేదని పలువురు గ్రామస్థులు పేర్కొంటున్నారు. సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలి..

-లెండుగురే శ్యాంరావు,
బీఆర్‌ఎస్‌పార్టీ సిర్పూరు ఇన్‌చార్జీ



కాగజ్‌నగర్-వాంకిడి మండలాలకు అనుసంధానంగా ఉండేందుకు మెట్‌పల్లి వాగు వద్ద చేపడుతున్న బ్రిడ్జి ఇంతవరకు పూర్తి కాలేదు. ఏడాదిలో కేవలం ఎండాకాలం, చలికాలం మాత్రమే రాకపోకలు ఉంటాయి. వర్షాకాలం మాత్రం వాగు ఉప్పొంగి ప్రవాహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయి. వంతెన కోసం అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి. నిధులు విడుదలయ్యేట్టు నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

గ్రూపు-2,3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించనున్న గ్రూపు-2,3 పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్టు కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాల, సెయింట్ క్లారెట్, వివేకానంద డిగ్రీ కళాశాల, సుప్రభాత్, జవహర్ నవోదయా విద్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతులపై సంబంధిత ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, ఇతరవసతులు కల్పించాలన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలను జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్నప్రతిభను చిన్నప్పటినుంచే వెలికితీయాలన్నారు. ఈసందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచివచ్చిన విద్యార్థులు గానం, సంగీత వాయిద్యాలు, విజివల్ ఆర్ట్స్, సంప్రదాయకథలు, చిత్రలేఖనం, డ్రామా తదితరఅంశాల్లో పాల్గొన్నారు. గానంలో వైశాలి(రెబ్బెన)ప్రథమ, నందిని (చింతలమానేపల్లి)ద్వితీయ, సంగీతవాయిద్యాలలో జోయల్(ఆసిఫాబాద్) ప్రథమ, బి.క్షితిజ్ (కాగజ్‌నగర్)ద్వితీయ, విజువల్‌ఆర్ట్స్‌లో అనూష(రెబ్బెన)ప్రథమ,ఎస్.శ్రావ్య (పెంచికలపేట) ద్వితీయ, సంప్రదాయ కథలు చెప్పడంలో గంగన్న(రెబ్బెన)ప్రథమ, కెలాలస(రెబ్బెన)ద్వితీయ, నృత్యప్రదర్శనలో ఆర్‌పౌర్ణమి(కౌటాల) ప్రథమ, జి.శ్రావణి (రెబ్బెన) ద్వితీయ,డ్రామాలో శ్రావణి (రెబ్బెన) ప్రథమ, వైష్ణవి(రెబ్బెన)ద్వితీయ బహుమతులు సాధించారు.



పోటీల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాష్ట్ర స్థాయిలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



జిల్లా విద్యార్థులతో నిర్వాహకులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్‌డ్రామా ఫెస్టివల్ పోటీల్లో ప్రతిభకనబర్చి మూడోస్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయిలో కృత్రిమ మేధా-సమాజం అనే అంశంపై ఎస్సీఈఆర్టీ గోదావరి హాల్‌లో నిర్వహించిన డ్రామాపోటీల్లో రాష్ట్రంలోని అన్నిజిల్లాలకు చెందిన బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌బాబు, జిల్లాసైన్స్ అధికారి మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రమేష్, ఇతర ప్రముఖల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్‌టీచర్ రాజేష్, వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

వాంకిడి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డిగ్రీ పూర్తైనవారు పట్టభద్రుల ఓటరునమోదు చేసుకోవాలని టీసీయువజనసంఘం అధ్యక్షుడు ప్రణయ్ కుమార్ అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో ఉచిత ఎన్రోల్మెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణ, ప్రిన్సిపాల్ కనకయ్య, విలాస్, మల్లేశం, స్వామి, రామచందర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బులాయి పండుగ

దహెగాం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినం గ్రామంలో పౌర్ణమిరోజు నుంచి రెండ్రోజులపాటు బులాయి పండుగ వేడుకలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గురువారం బొండేంబా మట్టి ప్రతిమలను తయారు చేసి ఆడిపాడారు. ఇలా రెండురోజుల పాటు గౌరమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం సమీప వాగుల్లో నిమజ్జనం చేస్తారు.

మెరుగైన విద్యాబోధన అందించాలి

బెజ్జూరు, అక్టోబరు 18: నూతనంగా చేరిన ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని ఎంఈవోసునీత అన్నారు. శుక్రవారం బెజ్జూరు స్కూల్‌కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు శిక్షణఇచ్చారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ఉత్తమబోధన అందించాలని సూచించారు.